క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన పాడేటి పాల్‌ను కులం పేరుతో దూషించిన సంఘటనపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. వివాదం జరిగిన తక్కళ్లపెల్లి గ్రామశివారులోని వ్యవసాయ భూమి వద్దకు డీఎస్పీ రవీందర్ రెడ్డి వెళ్లి సాక్షులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను బుధవారం ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య ఆవిష్కరించారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని నాయకులు కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ శేఖర్, వార్డుసభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సర్పంచులు గోపు శ్రీనివాస్, ఎం.జీ రెడ్డి, లౌడ్య దేవదాస్, భూమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం ఉపాధిహామీ పనులు, నర్సరీలో మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సతీష్, సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మీ, ప్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్లాపూర్: నిజాం షుగర్ పునరుద్ధరణకు ప్రభుత్వం కమిటీని నియమించడంతో మండలంలోని ముత్యంపేటలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, చెరుకు రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక చొరవతోనే సీఎం రేవంత్‌రెడ్డి కమిటీ వేశారన్నారు. త్వరలోనే చెరుకు రైతులకు మంచిరోజులు రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లూరి మహేశ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపెల్లి రామాగౌడ్, పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై కళాజాత



మాట్లాడుతున్న ఎస్సై శ్వేత

వెల్గటూర్ : ఎండపల్లి మండలం పాతగూడూర్‌లో బుధవారం సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఎస్సై శ్వేత మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా 100 కు డయల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో 'మహిళా శక్తి'

- పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులు • పాలనలో మహిళా సర్పంచుల మార్క్ • సన్మానించిన అధికారులు

పెగడపల్లి: ఐదేళ్లుగా వారి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఆ మహిళలు నిర్విరామంగా శ్రమించారు. ప్రజాసేవలో తమ మార్క్ చూపించారు. ఇంట్లో భర్త, పిల్లలు బాధ్యతలు, బయట ప్రజాసేవ రెండింటిని సమన్వయ పరుచుకుంటూ ఎందులోనూ పురుషులకు తాము ఎక్కడా తక్కువ కాదని, అందరి సహకారంతో పాలన చేపట్టారు. సర్పంచులుగా కీలక బాధ్యతలను సమానంగా సమర్థవంతంగా నిర్వహించి ఈ ఐదేళ్లలో వారి వారి గ్రామాల్లో అభివృద్ధి చేసి చూపించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండల పరిధిలోని పలువురు మహిళా సర్పంచులు బుధవారం సాక్షితో వారి మనోగతాన్ని పంచుకున్నారు..



మహిళా సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దా..



మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ బతికపల్లి. నాది రాజకీయ కుటుంబ నేపథ్యం. గతంలో జెడ్పీటీసీగా పనిచేశాను, నా భర్త సర్పంచ్, ఎంపీపీగా పనిచేశాడు. రాజకీయ అనుభవంతో జనరల్ స్థానంలో పోటీ చేసి గెలిచినా. అధికారులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాను.

– తాటిపర్తి శోభారాణి, సర్పంచ్ బతికపల్లి

అభివృద్ధికి కృషి చేశా..



మా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి నా శాయశక్తులా కృషి చేశాను. ఐదేళ్లలో తొంబైశాతానికి పైగా సీసీరోడ్లు నిర్మించాం. నర్సరీ, హరితహారం, పల్లె ప్రకృతివనం వంటి వాటిని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంతో శ్రద్ధ చూపాను. మా గ్రామం జిల్లాలో స్వచ్ఛ గ్రామంగా ఎంపికైంది.

– గుర్రం అనూష, సర్పంచ్ మద్దులపల్లి

సంతృప్తినిచ్చింది



సర్పంచ్‌గా గెలువకముందు పిల్లల ఆలనపాలన చూసుకోవడంతోనే గడిచిపోయేది. కానీ 2019లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక వ్వడంతో నా బాధ్యత పెరిగిపోయింది. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేశాను. ఐదేళ్ల పాలన ఎంతో సంతృప్తినిచ్చింది.

బాలుసాని నిహారిక, సర్పంచ్, దోమలకుంట

గ్రామాభివృద్ధే ధ్యేయంగా..



గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాను. సర్పంచ్‌గా పదవీ అనుభవం ప్రజాసేవలోని కష్టసుఖాన్ని తెలియజేసింది. సర్పంచ్‌గా నా బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించినందుకు సంతోషంగా ఉంది. హరితహారంలో చేపట్టిన సామూహిక మొక్కల పెంపకంలో జిల్లాలో మా గ్రామానికి మంచి పేరొచ్చింది.

– తోట గంగాభవానీ సర్పంచ్, రాములపల్లి

ప్రభుత్వ పథకాలు పక్కాగా..



ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని పక్కాగా అమలు చేసేందుకు నా వంతు కృషి చేశాను. నా భర్త గతంలో సర్పంచ్, ఎంపీటీసీగా చేశారు. ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనుకున్న. గ్రామంలో చాలా అభివృద్ధి పనులు చేపట్టాను.

– ఉమ్మెంతుల వనజ, సర్పంచ్, ల్యాగలమర్రి

అధికారుల సహకారంతో..



అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రధానంగా నా హయాంలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం చేయడం సంతోషానిచ్చింది. చిన్న గ్రామమైనా వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేశాను.

– ఇనుకొండ లక్ష్మి, సర్పంచ్, మ్యాక వెంకయ్యపల్లి

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలుపుతామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. లంబాడిపల్లిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపుతరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ, సర్వాపూర్ గ్రామ పంచాయతీ భవనం, ముత్యంపేటలో పల్లె దవాఖాన ప్రారంభించారు. మల్యాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం, నూకపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బిల్లు రాలేదని గ్రామ పంచాయతీ భవనానికి రెండు రోజుల క్రితం కాంట్రాక్టర్ తాళం వేయడంతో బిల్లు వచ్చేలా చూస్తామని స్థానికులు ఒప్పించడంతో తాళం తీయడం చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో సర్పంచులు బద్దం తిరుపతి, కట్కూరి తిరుపతి, గంగవ్వ, మిట్టపల్లి సుదర్శన్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ మారంపల్లి లక్ష్మణ్, జెజ్జంకి నర్సయ్య, ముత్యం శంకర్ పాల్గొన్నారు.



పల్లె దవాఖాన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

317 జీవోను సవరించి, ఉపాధ్యాయుల బాధలు తీర్చాలని లంబాడిపల్లి హెచ్‌ఎం రవీందర్ బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. 317 జీవోతో భార్యాభర్తలు వివిధ జోన్లలో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్‌లో నూతనంగా నిర్మించిన జీపీ బిల్డింగ్‌ను ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత,జెడ్పీటీసీ ప్రశాంతి,సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో పనులకు మున్సిపల్ కార్మికులా?

మెట్‌పల్లి/కోరుట్ల రూరల్: మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ తమ ఇంట్లో పనులకు పదేళ్లుగా మున్సిపల్ కార్మికులను వినియోగించుకుంటున్నారని పీసీసీ సభ్యుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో కార్మికులుగా ఉన్న ఐదుగురిని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యేలు సొంత పనులకు వినియోగించుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. పదేళ్లుగా వీరందరికి మున్సిపాలిటీల నుంచి వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కార్మికులకు మున్సిపల్ విధులు కేటాయించి, వారికి చెల్లించిన వేతనాల సొమ్మును రికవరీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్తామన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, కొంతం రాజు, మైపాల్‌రెడ్డి, జెట్టి లక్ష్మణ్, నరేశ్, షాకీర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు

దేశ రక్షణలో పాలుపంచుకోండి



మాట్లాడుతున్న ఆర్మీ పీవో

జగిత్యాల:యువత దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని ఆర్మీ పీవో ఈఎల్ పీజీ.శరత్‌కుమార్‌రెడ్డి, ఎల్బిసీ సీహెచ్.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అగ్నిపథ్ ఆధ్వర్యంలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ నియామకాలు చేపట్టే పద్ధతులను వివరించారు. పదిహేడున్నరేళ్ల నుంచి 21ఏళ్ల యువత సైనిక ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. రాత పరీక్ష, భౌతిక పరీక్ష పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, అధ్యాపకులు శ్రీలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

16న అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం

రాయికల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 16న అవిశ్వాస తీర్మానం పై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని బుధవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. అవిశ్వాసంపై కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు.

జిల్లా ఎన్‌వైకేఎస్ అడ్వయిజరీ మెంబర్‌గా విఘ్నేష్

కోరుట్ల: ఎన్‌వైకేఎస్ జిల్లా అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా కోరుట్లకు చెందిన రుద్ర విఘ్నేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విఘ్నేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కాంగ్రెస్ పోరాటం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం దివంగత మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఉద్యమాలు చేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంతో బుధవారం మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మూసివేసిన ఫ్యాక్టరీని తెరవాలనే డిమాండ్‌తో సుదీర్ఘకాలం పాటు మాజీ ఎమ్మెల్యే రామ్‌లు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు.

హక్కుల కోసం పోరాడాలి

గొల్లపల్లి : రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేయాలని భారత రాజ్యాంగ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సూరమల్ల సతీశ్ అన్నారు. మండలంలోని రంగధాముపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చాలామందికి రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలియదని, హక్కులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్ కుమార్, ఆర్‌ఐ జీవన్, గ్రామ సర్పంచ్, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలను నేటి తరానికి అందించాలి

మల్లాపూర్: అంబేడ్కర్ ఆలోచన విధానాలను, ఆశయాలను నేటి తరానికి అందించే విధంగా యశో బుద్ధ ఫౌండేషన్ కృషి చేస్తోందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎర్ర రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫౌండేషన్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ చూపిన బౌద్ధ మార్గంలో సర్వ మానవ సమానతకు నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు సిద్ధ బాలరాజు, నూతిపెల్లి రాజం, దళిత రాజు, మానవహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యం రఘు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం



సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

జగిత్యాల రూరల్/ మల్లాపూర్/ సారంగాపూర్/పెగడపల్లి/ గొల్లపల్లి: సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో బుధవారం జిల్లా వ్యాప్తంగా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులను, పాలకవర్గ సభ్యులను ఆయా గ్రామాల్లో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఐదేళ్లు వారు గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



అల్లీపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

రాయికల్: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో పద్మనాయక సంఘ భవనంలో బుధవారం నూతన బోరు ప్రారంభం,తెలుగువాడ , అత్తినేని వాడ, ఎంబరి వాడ, పలు వార్డుల్లో సుమారు రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సర్పంచ్ వార్డు సభ్యులను ఎమ్మెల్సీ సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాల్లో ఎమ్మెల్సీ పూజలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో జరుగుతున్న ఎల్లమ్మ పట్నాల్లో బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.ఆయన వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్ : ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిపల్లిలో సీజీఎఫ్ నిధులు రూ. 12 లక్షలతో నిర్మించనున్న మడేలేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మెట్ల చిట్టాపూర్‌లో జూట్ బ్యాగ్‌లు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీపీ సాయిరెడ్డి, సర్పంచ్ తిరుపతిరెడ్డి, రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేటలో గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం ఆవిష్కరించారు.గ్రామానికి చెందిన ఆడెపు రాజేశ్వర్ స్మారకార్థం ఆడెపు సత్తమ్మ విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, సుధాకర్,పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రహదారికి బిల్లులు చెల్లించవద్దు

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో ఖాదీకి చెందిన స్థలంలో మున్సిపల్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డుకు బిల్లులు చెల్లించవద్దని బీజేపీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడారు. ఖాదీ స్థలం పక్కన ప్రైవేట్ వ్యక్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, అక్కడ ప్రహరీ నిర్మించడానికి బదులు సీసీ రోడ్డును నిర్మించారన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మల్యాల: మండలంలోని మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు.

కేసు నమోదు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి బస్టాండ్ వద్ద అప్పు ఇచ్చిన డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవకు దారితీసి పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. పోతారం గ్రామానికి చెందిన పాలెపు లక్ష్మిపతి, ఇప్పపెల్లి గ్రామానికి చెందిన దొనకంటి రవీందర్ మధ్య అప్పులు ఇచ్చిన విషయంలో గొడవ జరిగిఇద్దరు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నారికి ఇన్సులిన్ అందజేత

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి సుహాసిని అనే బాలిక ఐదేళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది, గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పాపకు రెండు నెలల సరిపడా ఇన్సులిన్ మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో బుధవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్‌కుమార్ ఆవిష్కరించారు. సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, వీడీసీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ కులగణన నిర్ణయం హర్షణీయం

కథలాపూర్: రాష్ట్రంలో బీసీ కులగణన చేపడుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం కథలాపూర్ మాట్లాడారు. ఎన్నికల వేళ బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన విషయంలో ప్రభుత్వం ముందడుగు వేయడంతో బీసీలల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు.

కోదండరాం నియామకాన్ని జీర్ణించుకోని బీఆర్ఎస్

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్సీగా తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కోదండరాం నియామకాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, కోర్టు నుంచి స్టే తేవడం కేసీఆర్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ తెలంగాణలో 10 ఏళ్ల అధికారం చేపట్టి ఆయన కుటుంబసభ్యులు చేసిన అవినీతి భాగోతం బయటపడుతుందనే కోదండరాంను చట్టసభల్లోకి రానియ్యకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో టీజేఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంతి రమేశ్, పార్టీ సీనియర్ నాయకుడు రెబ్బటి మల్లయ్య యాదవ్, తిరుపతిచారి,మల్లయ్య, కిషోర్, పాల్గొన్నారు.

మత్తడికి గండి కొడుతున్నారని ఫిర్యాదు

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ శివారులోని చెరువు మాటు కాలువ మత్తడికి గుర్తు తెలియని వ్యక్తులు తరచూ గండి కొగుతున్నారని సర్పంచ్ వనతడుపుల అంజయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఒక సారి గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టటంతో మరమ్మత్తులు చేయించామని, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

మేడిపల్లి: యువత శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం కోసం ఓపెన్ జిమ్ ప్రారంభినట్లు బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఓపెన్ జిమ్ ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో పలు గ్రామాల సర్పంచులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రెసిడెంట్ ముంజ శ్రీనివాస్, పార్లమెంటరీ ఇన్‌చార్జి క్యాతం దశరథ్ రెడ్డి, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కోరుట్ల: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న జేఎల్ఎంలు బట్టు శివ, తుమ్మెనపెల్లి విష్ణు, నూనావత్ రాంజీ నాయక్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్కిల్ అధ్యక్షుడు తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం

ధర్మపురి: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలో చేపట్టే 14 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ రమేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన

రాయికల్: కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుష్ఠువ్యాధి నియంత్రణ డివిజన్ అధికారి దేవిసింగ్ కోరారు. బుధవారం రాయికల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పర్యవేక్షకుడు హీర్యానాయక్, మండల పర్యవేక్షకులు ప్రమీల, శ్రీధర్, రత్నమాణిక్యం,హెచ్ఎం రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎడ్ కళాశాల సమన్వయకర్తగా తిరుపతి

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న పడాల తిరుపతిని సమీకృత బీఎడ్ కళాశాల సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. వాటిని తిరుపతికి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అందించారు. ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ కార్యక్రమ సమన్వయకర్తగా లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారానికి మూడురోజుల ఆన్‌డ్యూటీ కింద పనిచేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయని ప్రిన్సిపాల్ తెలిపారు.